ఓట్ల లెక్కింపుపై సర్వత్రా ఉత్కంఠ

- వారం రోజుల్లో ఓట్ల లెక్కింపు
- గెలుపుపై ఎవరికి వారే ధీమా
- 87.94 శాతం ఓటింగ్


నూజివీడు మున్సిపల్ కార్యాలయం పోలింగ్ స్టేషన్‌లో ఓటేస్తున్న ఓటర్లు (ఫైల్)

నూజివీడు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపునకు మరో వారం రోజులే గడువు ఉండటంతో ఓటర్లలో, పోటీ చేసిన అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ఓట్ల లెక్కింపునకు ఏలూరులోని సీఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అభ్యర్థులు, రాజకీయ పక్షాలు ఎవరికి వారు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రికార్డు స్థాయిలో పోలింగ్

ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గ వ్యాప్తంగా 87.94 శాతం పోలింగ్ నమోదైంది. 2019 ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతం కంటే ఈ సారి 3 శాతం అధికంగా నమోదైంది. నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో 90 శాతం నుంచి 96 శాతం వరకు పోలింగ్ నమోదు కావడం గమనార్హం. పట్టణంలోని ఓటర్ల కంటే గ్రామాల్లోని ఓటర్లే ఓటేసేందుకు ఆసక్తి కనబరిచినట్లు నమోదైన పోలింగ్ శాతాన్ని చూస్తే అర్థమవుతోంది. నూజివీడు పట్టణంలో కేవలం 77.2 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. పట్టణంలో మొత్తం 42,705 ఓటర్లు ఉండగా 33,005 మంది ఓటర్లు మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా వృద్ధులు, మహిళలు మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో నిలబడి ఓటేశారు. కొన్ని చోట్ల రాత్రి 10 గంటల వరకు పోలింగ్ జరుగుతూనే ఉండటం గమనార్హం. ఈ పోలింగ్ కచ్చితంగా అధికార పక్షానికే మేలు జరుగుతుందని అధికార పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

తొలుత చాట్రాయి మండలం నుంచి కౌంటింగ్ ప్రారంభం

నియోజకవర్గ వ్యాప్తంగా 286 పోలింగ్ స్టేషన్‌లు ఉండటంతో వీటిలో తొలి పోలింగ్ స్టేషన్ చాట్రాయి మండలం కృష్ణారావుపాలెం కావడంతో అక్కడి నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించనున్నారు. రౌండ్‌కు 14 పోలింగ్ స్టేషన్‌లు కావడంతో మొత్తం 286 పోలింగ్ స్టేషన్‌ల లెక్కింపు పూర్తవడానికి 21 రౌండ్లు పడుతుంది. చాట్రాయి మండలం పూర్తయిన తరువాత ముసునూరు, నూజివీడు మండలంలోని కొన్ని పీఎస్‌లు, నూజివీడు టౌన్, మరల నూజివీడు మండలంలో మిగిలిన పీఎస్‌లు, చివరిగా ఆగిరిపల్లి మండలానికి సంబంధించి ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లను లెక్కిస్తారు. ఇప్పటికే ఆయా రాజకీయ పక్షాలు తమ అభ్యర్థుల తరఫున ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ ఏజెంట్ల నియామక ప్రక్రియను పూర్తి చేశారు.

నియోజకవర్గంలో మండలాల వారీగా పోలైన ఓట్ల వివరాలు

మండలం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు
చాట్రాయి	43,322	38,977
ముసునూరు	45,537	41,007
నూజివీడు	57,085	51,919
నూజివీడు టౌన్	42,705	33,005
ఆగిరిపల్లి	50,332	45,253
	2,38,981	2,10,161

ప్రతాప్‌కు వ్యతిరేకంగా ముందుకు రాని పందెంరాయుళ్లు

నూజివీడులో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు వ్యతిరేకంగా పందేలు కట్టడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. అధికార పక్షం నాయకులు ఒకటికి రెండు ఇస్తానంటేనే పందేలు కాస్తామంటూ ప్రతిపక్ష నాయకులు కబుర్లు చేస్తున్నారు. కౌంటింగ్ దగ్గర పడుతున్న కొద్దీ ప్రతిపక్ష పార్టీకి చెందినవారెవరూ పందేలు కాసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో ఎమ్మెల్యే మేకా ప్రతాప్ మరోసారి విజయభేరి మోగించనున్నారనే ప్రచారం నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా సాగుతోంది.

తోతాపురి ధర హోసం

- టన్ను రూ.20 వేలు
- చరిత్రలోనే అత్యధిక ధర
- రోజుకు 1500 టన్నుల ఎగుమతి


ఎగుమతి చేయడానికి సిద్ధంగా ఉన్న తోతాపురి మామిడి కాయలు

నూజివీడు: తోతాపురి.. వీటినే కలెక్టర్ మామిడి అని కూడా అంటారు. వీటి రుచి అమోఘం. సాధారణంగా వీటిని ముక్కలుగా చేసి ఊరబెట్టి తినడానికి, జ్యూస్ తయారీకి, తాండ్ర తయారీకి ఎక్కువగా ఉపయోగిస్తారు. తోతాపురి కాయలకు మామిడికాయల చరిత్రలోనే ఇంతవరకు పలకని అత్యంత ఎక్కువ ధర ఈ ఏడాది పలుకుతోంది. దీంతో ఈ తోటల రైతులకు, తోటలను కాపునకు కొనుగోలు చేసిన వ్యాపారులకు కాసుల వర్షం కురుస్తోంది. టన్ను తోతాపురి కాయలను రూ.19,500 నుంచి రూ.20 వేల వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. నూజివీడు పరిసర ప్రాంతాల నుంచి రోజుకు 1500 టన్నుల తోతాపురి కాయలను ఎగుమతి చేస్తున్నారు. తోతాపురి కాయలకు ఏ ఏడాది చూసినా టన్నుకు గరిష్టంగా రూ.10 వేలకు మించి ధర లభించేది కాదు. ఈ ఏడాది మాత్రం ఇటీవల వరకు రూ.15 వేల వరకు పలికిన ధర గత వారం రోజులుగా అమాంతం రూ.20 వేలకు పెరిగింది. గతేడాది కంటే దిగుబడి తగ్గడం వల్లే అత్యధిక ధర లభిస్తోందని తెలుస్తోంది.

జ్యూస్, తాండ్ర, ముక్కలకు ఎగుమతి

తోతాపురి (కలెక్టర్) కాయలు మామిడి జ్యూస్, తాండ్ర తయారీకే కాకుండా ముక్కలు కోసి వాటిని ఉప్పులో ఊరబెట్టి కోల్‌కతా, చెన్నై, ముంబయి తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. జ్యూస్ తయారీకి చిత్తూరు జిల్లాలోని జ్యూస్ ఫ్యాక్టరీలకు ఎగుమతి అవుతోంది. తాండ్ర తయారీకి స్థానికంగాను, ఇతర జిల్లాల్లో ఉన్న తాండ్ర తయారీ యూనిట్లకు తరలిస్తున్నారు. అయినా వ్యాపారులందరూ తోతాపురి కాయల కోసం ఎగబడుతుండటంతో ఎన్నడూ లేని విధంగా ధర లభిస్తోంది. నూజివీడు మండలం వెంకటాద్రిపురం, తూర్పు దిగవల్లి, ఆగిరిపల్లి మండలం ఈదర, రెడ్డిగూడెం మండలం ముచ్చనపల్లి వద్ద ఉన్న ముక్కల కొట్టులకే దాదాపు 300 టన్నుల వరకు తోతాపురి కాయలు ఎగుమతి అవుతున్నాయి. నూజివీడు ప్రాంతంలోని వేయింగ్ బ్రిడ్జిలు ఖాళీగా ఉండటం లేదంటే అతిశయోక్తి కాదు. ఒకవైపు బంగినపల్లి ధర పడిపోయిన నేపథ్యంలో తోతాపురికి ధర పెరగడంతో రైతుల్లోను, రైతుల వద్ద కాపు కొనుగోలు చేసిన వ్యాపారుల్లోను, ఫ్యాక్టరీలకు కాయలు ఎగుమతి చేస్తున్న వ్యాపారుల్లోను సంతోషం వెల్లివిరుస్తోంది.

ఇంత ధర ఎన్నడూ లభించలేదు



తోతాపురికి ప్రస్తుతం టన్నుకు రూ.20 వేలు ధర లభిస్తోంది. జ్యూస్ ఫ్యాక్టరీల వారు, తాండ్ర, ముక్కల పరిశ్రమల వారు తోతాపురి కాయల కోసం ఎగబడుతున్నారు. 30 ఏళ్ల నుంచి వ్యాపారం చేస్తున్నా. రూ.10 వేలు పలికితే మంచి ధర వచ్చిందనుకునేవాళ్లం. ఈ ఏడాది రికార్డు స్థాయిలో దానికి రెట్టింపు ధర లభిస్తోంది.

– శీలం రాము, మామిడి వ్యాపారి

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి


కౌలు రైతు సంఘం జిల్లా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

ఇబ్రహీంపట్నం: కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు కోరారు. కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు దంతాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఇబ్రహీంపట్నంలో సోమవారం జరిగింది. 2019లో ప్రభుత్వం తీసుకొచ్చిన సీసీఆర్సీ చట్టానికి సవరణలు చేసి ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డు ఇచ్చి ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల రాయితీలు వర్తింపచేయాలని కోరారు. సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు, జిల్లాలోని వివిధ మండలాల కౌలు రైతు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు


మైలవరం ఆర్బీకేలో పచ్చిరొట్ట పైరులపై అవగాహన సదస్సులో పాల్గొన్న ఏఓ సత్యవతి, సంధ్యారాణి

మైలవరం: రైతులకు కావాల్సిన పచ్చిరొట్ట విత్తనాలు జనుము(10కిలోలు ప్యాకెట్‌లు), పిల్లి పెసర(8కిలోలు ప్యాకెట్‌లు) మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా రైతు శిక్షణ కేంద్రం ఏఓ సత్యవతి తెలిపారు. మైలవరం రైతు భరోసా కేంద్రంలో రైతులకు పచ్చిరొట్ట పైరులపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో వేసే పత్తి, వరి, అపరాల రకాలపై రైతులకు అవగాహన కల్పించారు. పత్తి, వరి, అపరాలు తదితర విత్తనాలను రైతులు అధీకృత డీలర్ వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన బిల్లులు తీసుకుని పంట కాలం మొత్తం భద్రపర్చుకోవాలన్నారు. మైలవరం మండలం ఏఓ సంధ్యారాణి మాట్లాడుతూ జీలుగు విత్తనాల కోసం రైతులు తమ పేర్లు వ్యవసాయ శాఖ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు టి.శ్రావ్య, జె.హాసన్, రైతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా తాగునీటి సరఫరా పనులు


చనుబండలో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకు

చాట్రాయి: వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషితో జలజీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామాల్లోని జనాభా ప్రాతిపదికన తాగునీరు అవసరం మేరకు ట్యాంకులు నిర్మించి పైప్‌లైన్‌ల ద్వారా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేస్తున్నారు. మండలంలోని చనుబండలో రూ.95 లక్షలతో బోరు, 90 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు, పైప్‌లైన్ పనులు పూర్తి చేసి తాగునీరు సరఫరా చేస్తున్నారు. సూరంపాలెంలో రూ.34 లక్షల వ్యయంతో బోరు, పైప్‌లైన్ పనులు పూర్తి చేశారు. కొత్తగూడెంలో రూ.25 లక్షల వ్యయంతో 30 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు, పైప్‌లైన్ పనులు పూర్తి చేసి తాగునీరు సరఫరా చేశారు. చిత్తపూరులో రూ.88 లక్షలు, పోతనపల్లిలో రూ.91 లక్షలు, నరసింహారావుపాలెంలో రూ.27 లక్షలతో తాగునీరు సరఫరా పనులు చేపట్టారు.

మండుతున్న కూరగాయల ధరలు


ఆగిరిపల్లిలో కూరగాయల దుకాణం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల కూరగాయల సాగు తగ్గిపోవడంతో కూరగాయల ధరలు పెరిగాయని చెబుతున్నారు. నెల రోజుల్లోనే కూరగాయల రేట్లు రెట్టింపు కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజులుగా కూరగాయల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్యుడు కొనలేని పరిస్థితి నెలకొంది. పచ్చిమిర్చి కేజీ రూ.100 పలుకుతుండటంతో ముట్టుకోకుండానే మంట పుట్టించేస్తోంది. టమాటా, దోస కేజీ రూ.50, క్యారెట్, బీర, బెండ రూ.60, కాకర రూ.80 చొప్పున అమ్ముతున్నారు. ఈ ధరలు ఇలాగే కొనసాగితే పచ్చడి మెతుకులే గతి అంటూ సామాన్యులు వాపోతున్నారు.

వీరేశలింగం గొప్ప సంఘ సంస్కర్త


వీరేశలింగం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి, పాఠకులు, విద్యార్థులు

నూజివీడు: పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో సోమవారం సంఘ సంస్కర్త, నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు వర్థంతి నిర్వహించారు. తొలుత వీరేశలింగం పంతుల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం పంతులు ఆనాటి సమాజంలో పాతుకుపోయిన మూఢాచారాలను పారదోలేందుకు విశేషంగా కృషిచేశారన్నారు. స్త్రీవిద్య కోసం కృషి చేయడమే కాకుండా బాలికల చదువు కోసం ప్రత్యేక పాఠశాలలను సైతం స్థాపించారన్నారు. చిన్న వయస్సులోనే వితంతువులైన బాలికల జీవితాల్లో వెలుగులు నింపేందుకు వితంతు పునర్వివాహాలు చేయాలని ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు విశేషంగా కృషి చేశారన్నారు. రాష్ట్రంలో బ్రహ్మసమాజాన్ని స్థాపించడమే కాకుండా సమాజ సేవకు హితకారిణి అనే సంస్థను స్థాపించి తన యావదాస్తిని దానికి రాసిచ్చారన్నారు. సాహిత్యంలోనే విశేష ప్రతిభను కనబరిచిన ఆయన తెలుగులో 130కి పైగా గ్రంథాలు రాశారన్నారు.

పశు బీమాతో పాడి రైతుకు మేలు


మేతకు వెళ్తున్న ఆవులు

మైలవరం: పశు బీమాతో పాడి రైతులకు లబ్ధి చేకూరుతుంది. వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల సంక్షేమం దృష్టిలో పెట్టుకుని మూగ జీవాల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేసింది. గత ప్రభుత్వ హయాంలో పలు ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల బారిన పడి మూగజీవాలు మృత్యు బారిన పడి పాల రైతులు జీవనోపాధి కోల్పోయారు. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం రాకపోగా బీమా సౌకర్యం ఇచ్చిన సందర్భాలు కూడా లేవు. కానీ వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఉచితంగా పశు బీమా నష్ట పరిహారం పథకం అమలు చేశారు. గతంలో 50 శాతం చొప్పున బీమా అమలు చేసేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరింత మంది రైతులకు లబ్ధి చేకూర్చే లక్ష్యంతో వైఎస్సార్ పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టి, దారిద్ర్య రేఖకు దిగువనున్న వారితో పాటు ఎస్సీ, ఎస్టీలకు ప్రీమియంలో 80 శాతం రాయితీ ప్రకటించింది. దారిద్ర్య రేఖకు దిగువనున్న వారికి ప్రభుత్వమే 50 శాతం ప్రీమియం చెల్లించే బాధ్యత తీసుకుంది. అంతే గాక రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన మిశ్రమ దాణా, పశు గ్రాసం, చాఫ్ కట్టర్‌లు పంపిణీ చేసింది. పశువుల ఆరోగ్యం కాపాడేందుకు నియోజకవర్గానికి రెండు మొబైల్ అంబులెన్స్‌లు కూడా ఏర్పాటు చేసి రైతు ఇంటి ముంగిటకే పశు వైద్య సేవలు అందిస్తోంది.

నియోజకవర్గంలోని మండలాల్లో పశు సంపద..

మండలం	గొర్రెలు	మేకలు	ఆవులు	గేదెలు
జి.కొండూరు	11,331	4463	607	13,214
మైలవరం	16,637	6632	1263	14,882
రెడ్డిగూడెం	14,060	6781	1186	16,570
ఇబ్రహీంపట్నం	--	13,668	494	10,693

పశు బీమా వివరాలు..

మండలం	చెల్లించాల్సిన పరిహారం రూ.	చెల్లించినది రూ.
మైలవరం	1,76,700	49,152
ఇబ్రహీంపట్నం	1,76,700	70,776
జి.కొండూరు	1,81,700	16,896
రెడ్డిగూడెం	1,76,600	1,51,488

పేకాట శిబిరంపై దాడి

వీరులపాడు: పేకాట శిబిరంపై దాడిచేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మహాలక్ష్మణుడు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు మండలంలోని దొడ్డదేవరపాడు గ్రామ శివారులో సోమవారం పేకాడుతున్నారనే సమాచారం రావడంతో ఆయన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ ఘటనలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. రెండు వేల నగదు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ వెంకయ్య స్వామి టెంపుల్ ఫీడర్ లైన్ల మరమ్మతులలో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు సిరి అపార్ట్‌మెంట్ ఏరియా, సాహితీ విల్లాస్ ఏరియా, సాయిపురం కాలనీ ఏరియా, బండి అపార్ట్‌మెంట్ ఏరియా, వెంకయ్య స్వామి టెంపుల్ రోడ్, ఎండోమెంట్ ఆఫీస్ ఏరియా, వాసవి ఫార్మా మెడికల్ కాంప్లెక్స్ ఏరియా, కృష్ణ గోదావరి అపార్ట్‌మెంట్ ఏరియా, అభినందన అపార్ట్‌మెంట్ ఏరియా, రావూరి వెంచర్స్ అపార్ట్‌మెంట్ ఏరియా, జీఐజీ స్కూల్ ఏరియా, ల్యాంకో కాలనీ ఏరియా, మురళీ కృష్ణ టింబర్ డిపో ఏరియా, పైపుల కంపెనీ ఏరియా, రాధా మాధవ్ టింబర్ డిపో ఏరియా, రెడీమిక్స్ ప్లాంట్ ఏరియా వరకు పైన పేర్కొన్న సమయాల్లో కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కంచికచర్ల : ప్రభుత్వ అనుమతులు లేకుండా ఉపనదుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతోపాటు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ పెంకె వెంకట సత్య సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. మండలంలోని కీసర మున్నేటి నుంచి కంచికచర్లకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం పట్టుకుని, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు



సత్యనారాయణపురం(విజయవాడ సెంట్రల్):నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నార్త్‌జోన్ ఏసీపీ దేవరకొండ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఎన్‌పురం, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా ఏకకాలంలో రైల్వేస్టేషన్, పార్శిల్ కార్యాలయం, వెస్ట్ ప్రవేశద్వారం పరిసరాల్లో సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్‌లోని వెయిటింగ్ రూమ్స్, డార్మెటరిలు, ప్రైవేటు రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉన్న హోటళ్లు, లాడ్జిలు, డార్మెటరీలను తనిఖీ చేసి అనుమానితులను ఐరిష్ సాయంతో వారిపై గతంలో ఉన్న కేసుల వివరాలను తెలుసుకున్నారు. ఈ క్రమంలో గతంలో కేసులు ఉన్న ఇద్దరు పాత నేరస్తులను రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తించి వారి రాకకు గల కారణాలను తెలుసుకునేందుకు అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని హోటల్‌లు, లాడ్జిలు, డార్మెటరీలలో అనుమానిత వ్యక్తులు, సరైన గుర్తింపు లేని వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు అందించాలని ఏసీపీ దేవరకొండ ప్రసాద్ యజమానులను ఆదేశించారు. ఎస్ఎన్‌పురం, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు వెంకట నారాయణ, పి.శ్రీనివాస్, ఫతే అలీబేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

ముచ్చనపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రెడ్డిగూడెం: మండలంలోని ముచ్చనపల్లి సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కిరణ్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఎస్ఆర్ఆర్‌లో ప్రారంభమైన పాలిసెట్ కౌన్సెలింగ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా ప్రారంభమయ్యింది. 4,001 ర్యాంకు నుంచి 8వేల ర్యాంకు వరకు అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 48 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారు. కార్యక్రమాలను అధ్యాపకుడు డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. మంగళవారం 17,001 నుంచి 22వేలు ర్యాంకు వరకు విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు.

ఉపాధి కూలీల వేతనం పెంచాలి

విస్సన్నపేట: కేంద్రప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించాలని, కనీస వేతనం రూ.600 పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వి.నాగరాజు అన్నారు. విస్సన్నపేటలో ఉపాధి హామీ పథకం కూలీలతో సోమవారం ఆయన మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతినే అమలు చేయాలన్నారు.

సవరణ

[illegible]

క్లుప్తంగా

శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందిస్తున్న జేవీవీ

తిరువూరు: ప్రజల్లో మూఢనమ్మకాలు పోగొట్టి, శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించేందుకు కృషిచేస్తున్న జనవిజ్ఞాన వేదికలో ప్రతి ఒక్కరూ సభ్యులుగా చేరాలని వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి లక్కిపోగు గంగాధర్ కోరారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సోమవారం జరిగిన జేవీవీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 36 సంవత్సరాలుగా సామాజిక చైతన్యం కోసం కృషిచేస్తున్న జేవీవీలో సభ్యత్వం స్వీకరించడానికి విద్యావంతులు ముందుకు రావాలని కోరారు. సమావేశంలో వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు హరికృష్ణ, కార్యవర్గ సభ్యులు రాంప్రదీప్, పాపారావు, సుదర్శన్, సుధాకర్ పాల్గొన్నారు.

పది పరీక్షలకు 180 మంది గైర్హాజరు

నూజివీడు: డివిజన్‌లోని ఐదు పరీక్ష కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన పదో తరగతి సప్లిమెంటరీ ఇంగ్లిష్ పరీక్షకు 180 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీవైఈవో ఎం.సేవియా తెలిపారు. మొత్తం 222 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వాల్సి ఉండగా కేవలం 42 మంది మాత్రమే హాజరయ్యారు. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో 65 మందికి ముగ్గురు, జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ కేంద్రంలో 41 మందికి 12 మంది, ముసునూరు హైస్కూల్ సెంటర్‌లో 39 మందికి నలుగురు, చాట్రాయి హైస్కూల్ సెంటర్‌లో 36 మందికి 13 మంది, ఆగిరిపల్లి హైస్కూల్ సెంటర్‌లో 41 మందికి 10 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు.

ఇంటర్ పరీక్షకు 44 మంది గైర్హాజరు

నూజివీడు: పట్టణంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గణితం, బోటనీ, సివిక్స్ పరీక్షలకు సంబంధించి ప్రథమ సంవత్సరంలో 33 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి మొత్తం 695 మంది విద్యార్థులకు గాను 663 మంది పరీక్ష రాశారు. పట్టణంలోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీశారదా జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 321 మందికి 305 మంది హాజరవ్వగా, 16 మంది గైర్హాజరయ్యారు. శ్రీశారద జూనియర్ కళాశాలలో 374 మందికి 357 మంది పరీక్ష రాయగా 17 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి మడుపల్లి తాతయ్య ప్రభుత్వ కళాశాల పరీక్ష కేంద్రంలో 267 మందికి 256 మంది పరీక్ష రాయగా, 11 మంది గైర్హాజరయ్యారు.

విద్యార్థులు సానుకూల దృక్పథంతో ఉండాలి



మైలవరం: విద్యార్థులు సానుకూల దృక్పథం (పాజిటివ్ థింకింగ్)తో ఉండాలని, అప్పుడే అనుకున్నది సాధించగలుగుతారని మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల గ్రంథాలయాధికారి టి.సాంబశివరావు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మైలవరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ గురించి సోమవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై ధ్యాస పెట్టి చదవాలన్నారు. గ్రంథాలయాల సేవలు సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. పోటీ పరీక్షలకు జనరల్ నాలెడ్జ్ ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో మైలవరం శాఖా గ్రంథాలయాధికారి నాగార్జున, సిబ్బంది, పాఠకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

తిరువూరు: జూన్ 5న పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా తిరువూరు వసుధ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆనందరావు తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు తిరువూరు శ్రీనిధి జూనియర్ కళాశాలలో 7,8,9,10 తరగతుల విద్యార్థులకు 28వ తేదీ ఉదయం 9 గంటలకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పాల్గొనదలచిన విద్యార్థులు 63024 82279 నంబరులో సంప్రదించాలని కోరారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు

'సాక్షి' కథనానికి స్పందన

ఆగిరిపల్లి: విచ్చలవిడిగా నాటుసారా అమ్మకాలు శీర్షికన 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన కథనంపై ఎస్ఐ సురేంద్ర కుమార్ స్పందించారు. సోమవారం తమ సిబ్బందితో కలిసి ఆగిరిపల్లిలో విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో స్థానిక గౌడ బజార్‌లో సారా అమ్ముతున్న మరీదు రమాదేవిని అదుపులోకి తీసుకుని ఆమె నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఆమెను అరెస్ట్ చేసి నూజివీడు కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.